వజ్రాల దొంగలు

పి. అరుణ

అర్థరాత్రి—పన్నెండు గంటలు దాటి పది నిమిషాలు.

చలికాలం కావటంతో మనుషులంతా ఇళ్ళలో పడుకుని తలుపులు బిగించుకున్నారు.

ఆ భవనం బయట గేటు దగ్గర వున్న చిన్న కేబిన్ బయట బల్లమీద కూర్చున్న గూర్ఖా నిద్రతో కునికి పాట్లు పడుతున్నాడు. అతను ఆ రోజు సాయంత్రం కొంచెం మందు సేవించాడు.

అందువల్ల ఆ చీకటి వీధిలో గోడవారగా చప్పుడు చెయ్యకుండా నడిచివచ్చిన ఇద్దరుమనుషులను గూర్ఖా గమనించే అవకాశం లేకుండా పోయింది.

నిద్రపోతున్న గూర్ఖాను చూడగానే వాళ్ళకు సంతోషం కలిగింది. నిద్రపోతున్నాడని అతన్ని వదలేదు.

ఆ ఇద్దరిలో ఒకడైన రాజు పాంటుజేబులోనించి క్లోరోఫాం చల్లిన కర్చీఫ్ తీసి గూర్ఖా మొహంమీద

వుంచి గట్టిగా అదిమాడు వెనుకనిల్చుని.

రెండు నిమిషాల తర్వాత గూర్కా స్పృహ కోల్పోయాడని గ్రహించి ఇద్దరూ అతన్ని కేబిన్‌లోకి లాగి ఓ కార్నర్‌లో పడుకోబెట్టారు.

క్షణంకూడా ఆలస్యం చెయ్యకుండా ఇద్దరూ గోడ మీదనించి లోపలకు దూకారు.

తోటలో మొక్కలు గుబురుగా పెరిగి వున్నాయి. దీపం దూరంగా ఎక్కడో వెలుగుతోన్నది.

రెండు నిమిషాలు అక్కడే నిల్చుని చూశారు.

అంతా నిశ్శబ్దంగా వుంది.

అక్కడినించి కదిలి రివ్వున ముందుకు దూసుకువెళ్ళారు. వాళ్ళిద్దరి నీడలు తోటలో వెలుగుతున్న దీపం వెలుగులో పొడుగ్గా సాగుతున్నాయి.

నీటిగొట్టం దగ్గర ఆగిపోయారు.

ముందు విక్రమ్ దాన్ని పట్టుకుని పైకి పాకాడు. అతని తర్వాత రాజుకూడా పైకి వెళ్ళాడు.

బాల్కనీలో దీపం వెలగడంలేదు.

నడవాలో గుడ్డిదీపం వెలుగుతోంది. నడుస్తున్నారు.

విక్రమ్ బాగా పొడుగ్గా ఉన్నాడు — సన్నగా వున్నాడు—రాజు కొంచెం పొట్టిగా వున్నాడు. లావుగా వున్నాడు.

వరుసగా చూసుకుంటూ నడుస్తున్నప్పుడు వాళ్ళకు తాళాలు బిగించి వున్న గదులు కనిపించాయి.

ఓ గది దగ్గర ఆగిపోయారు.

ఆ గదికి అద్దాల కిటికీలు వున్నాయి. అద్దాల వెనుక తెరలు వేల్లాడుతున్నాయి.

వంగి చూశాడు విక్రమ్.

ఫోమ్ బెడ్ మీద పడుకుని గాఢనిద్రలో వున్న సేట్ చందన్ లాల్ కనిపించాడు.

చిన్నగా నవ్వాడు విక్రమ్.

నవ్వుతూ రాజును చూశాడు.

రాజు భుజానికి వున్న నల్లని బ్యాగ్ లోనించి ఓ పరికరాన్ని బయటకు తీశాడు. నిమిషాల్లో పొడుగ్గా వున్న కిటికీ అద్దాన్ని కోశాడు.

అద్దం కిందపడి చప్పుడవకుండా పట్టుకుని కింద పెట్టాడు విక్రమ్.

లోపలకు వెళ్ళారు.

చందన్ లాల్ వెల్లకింతలా పడుకుని వున్నాడు. నిద్రలో అతని పెదవుల మధ్యనించి ఏదో సన్నని శబ్దం బయటకు వస్తోన్నది.

ఆ గదిలోనే ఓ కార్నర్ లో వున్న సేఫ్ ను ఆ ఇద్దరూ చూశారు.

వాళ్ళ కళ్ళు మెరిశాయి.

"బాస్ చెప్పింది ఈ సేఫ్ గురించే కదూ?"

"అవును" తల వూపాడు రాజు.

"చందన్ లాల్ ను నిద్రలేపకుండా మనం ఈ సేఫ్ ను తెరువగలమా?" అడిగాడు విక్రమ్.

"అసాధ్యం. ఐనా నేను సేఫ్ తెరవటానికి అవసరమైన సాధనాలన్నీ తీసుకురాలేదు. అందువల్ల సేట్ ను నిద్రలేపక తప్పదు."

ఇద్దరూ జేబుల్లోనించి పిస్తోళ్ళు బయటకు తీశారు. చందన్ లాల్ కు రెండువైపులా నిల్చున్నారు.

రాజు—చందన్ లాల్ భుజంమీద పిస్తోలు మొనతో పొడిచాడు. రెండు నిమిషాలు ఆగి కళ్ళు తెరిచి ఉలిక్కి

పడ్డాడు చందన్‌లాల్.

భయంతో పెద్దగా అరవటానికి నోరు తెరిచాడు. క్షణంకూడా ఆలస్యం చెయ్యకుండా రాజు పిస్తోలును చందన్‌లాల్ నోట్లో వుంచి—

"అరిస్తే పిస్తోలు పేలుతుంది. చస్తావ్" అన్నాడు క్రూరంగా చూస్తూ....

చందన్‌లాల్ కళ్ళు మరింత భయంతో విచ్చుకున్నాయి.

ఆ ఇద్దరు దొంగలూ మన్నుతిన్న పాములాంటి గూర్ఖాను తప్పించుకుని లోపలకు ఎలా రాగలిగారో ఆయనకు అంతుపట్టలేదు.

విక్రమ్ ప్యాంటు జేబులోనించి సెలో టేప్ తీసి దాన్ని చందన్‌లాల్ నోటికి అంటించివేశాడు.

లేచి నిల్చోమన్నాడు.

నిల్చున్నాడు చందన్‌లాల్.

"ఇక నువ్వు నేను చెప్పినట్టు చెయ్యి. ఏ మనిషికైనా ప్రాణాలే ముఖ్యం చందన్‌లాల్. ప్రాణాలు వుంటే ఎంత సంపదనైనా మళ్ళీ సంపాదించవచ్చు. ఈ విషయం అరవై యేళ్ళున్న నువ్వు తెలుసుకునే వుంటావు. అందువల్ల నీ ప్రాణాలు దక్కించుకోవాలంటే నేను చెప్పినట్టుగా చెయ్యి. నీ దగ్గర కోటి రూపాయలు ఖరీదు చేసే ఎనిమిది వజ్రాలు వున్నాయి. వాటిని నువ్వు ఈ గదిలో వున్న సేఫ్‌లో భద్రంగా దాచావు. ఆ ఎనిమిది వజ్రాలనూ సేఫ్ తెరిచి మాకివ్వు. అలా ఇవ్వటంవల్ల నీ ప్రాణాలను కాపాడుకునే అవకాశం వుంటుంది" అన్నాడు విక్రమ్.

సేట్ చందన్‌లాల్ తలను అడ్డంగా వూపాడు.

'ఆ వజ్రాలు నా దగ్గర లేవు' అన్నట్టుగా సైగ చేసి చూపాడు చందన్‌లాల్.

చిన్నగా నవ్వాడు విక్రమ్.

నవ్వి "ఈ ప్రపంచంలో ఎవరైనా పొరపాటుపడే అవకాశం వుంది. కాని మా బాస్ అలా పొరపడే అవకాశంలేదు. ఈ విషయం నీకు తెలీదు. నువ్వు వారం రోజుల క్రితం విదేశాలనించి వచ్చిన మనుషుల దగ్గర ఆ వజ్రాలను కొన్న విషయం మా బాస్‌కు తెలిసింది. అందువల్లనే ఆయన మా ఇద్దర్నీ పంపించాడు. కాబట్టి నువ్వు బుకాయించి ప్రయోజనంలేదు" అన్నాడు.

ఐనా చందన్‌లాల్ మళ్ళీ ఆ వజ్రాలు లేవన్నట్టు తల వూపాడు.

"నువ్వు లేవని చెప్పినా నిన్ను చంపి ఆ సేఫ్‌ను తెరుస్తాము. అందుకు నువ్వు ఒప్పుకుంటావా?" అన్నాడు రాజు.

వద్దన్నాడు చందన్‌లాల్.

"ఐతే.... సేఫ్ తెరిచి ఆ ఎనిమిది వజ్రాలనూ ఇచ్చెయ్యి. నీ ప్రాణాలు దక్కించుకో" అన్నారిద్దరూ ఒకేసారి.

చందన్‌లాల్‌కు యేడుపు వచ్చింది. ఏడ్చినందువల్ల ప్రయోజనం వుండదని తలగడ కిందినించి సేఫ్ తెరిచే కీస్ తీసుకుని సేఫ్ దగ్గరకు నడిచాడు.

ఐదు నిమిషాల తర్వాత సేఫ్ తెరిచాడు. ఆయన సేఫ్ తెరిచేలోపుగా ఆ ఇద్దరూ నాలుగుసార్లు పిస్తోలుతో ఆయన్ని బెదిరించవలసి వచ్చింది.

కోటిరూపాయలు ఖరీదు చేసే వజ్రాలను ఇద్దరు మనుషులకు ప్రాణాలకు భయపడి ఇచ్చెయ్యటం ఆయనకు

ఇష్టంలేక పోయింది.

ఐనా రెండు పిస్తోళ్ళకు_క్రూరులైన ఇద్దరు దొంగ లకు భయపడి వాటిని ఇవ్వక తప్పటంలేదు.

సేఫ్ తెరుచుకుంది.

మొదటి అరలో కొంత కరెన్సీ వుంది. దాన్ని లాక్కొని నల్లని బ్యాగ్ లో వుంచాడు రాజు.

తర్వాత పిస్తోలు మొనతో విక్రమ్ వెన్నులో పొడిచిన తర్వాత రహస్య అరను కూడా తెరిచి అందులో వున్న చిన్న పెట్టెలో వున్న ఎనిమిది వజ్రాలనూ తీశాడు చందన్ లాల్.

ఆ వజ్రాల పెట్టెను తీసుకున్న తర్వాత చందన్ లాల్ కు తన ప్రాణంకన్నా ఆ వజ్రాలే విలువైనవిగా అనిపించాయి. అందుకే మొండిగా ఆ వజ్రాలను ఇవ్వనని మొరాయించాడు.

విక్రమ్ నవ్వి "నువ్వు ఆఖరి నిమిషాల్లో తెలివి తక్కువగా ప్రవర్తిస్తున్నావు. అందువల్ల నువ్వు ప్రాణాలు పోగొట్టుకుంటావు" అన్నాడు.

చందన్ లాల్ వినలేదు.

రాజు ఏమరుపాటుగా వున్నాడని తెలుసుకున్నాడు. రాజు దృష్టి చందన్ లాల్ చేతిలో వున్న వజ్రాల పెట్టె మీద వున్నది.

అందుకే అతన్ని వెనక్కునెట్టి ఆ పెట్టెతో అక్కడి నించి పరుగుదీసే ప్రయత్నం చేశాడు సేట్.

విక్రమ్ చేతిలో వున్న సైలెన్సర్ బిగించిన పిస్తోలు రెండుసార్లు పేలింది. సేట్ బోర్లాపడిపోయాడు ముందుకు_ చేతిలో వున్న వజ్రాల పెట్టె పడిపోయింది.

విక్రమ్ దాన్ని తీసుకుని "క్విక్.... వెంటనే మనం

ఇక్కడినించి బయటపడాలి" అన్నాడు రాజుతో.

రాజు మాట్లాడలేదు.

మరోసారి తెరచివున్న సేఫ్‌ను తెరిచి అందులో ఉన్న రెండు బంగారు గొలుసులను ప్యాంటు జేబులో పెట్టుకుని ఆ గదిలోనించి వచ్చిన దారిలోనే బయట పడ్డాడు. అప్పటికే విక్రమ్ పీటిగోట్టం పట్టుకుని కిందికి జారే ప్రయత్నంలో వున్నాడు.

ఆ ఇద్దరూ సేట్ చందన్‌లాల్ బతికివున్నాడో— ప్రాణాలు వదిలాడో గమనించకుండానే వెళ్ళిపోయారు.

కాని — చందన్‌లాల్ చావలేదు. ఆయన బతికే ఉన్నాడు. కొన ఊపిరితో ఉన్నాడు. ఆ కొన ఊపిరితోనే నోటికి ఉన్న టేప్‌ను లాగేసుకుని ఆ గదిలోనే ఉన్న ఫోన్ దగ్గరకు వెళ్ళి పోలీసులకు విక్రమ్—రాజు తన దగ్గర దోచుకుని వెళ్ళిపోయిన ఎనిమిది వజ్రాల గురించి చెప్పాడు.

2

పబ్లిక్ టెలిఫోన్ బూత్. లోపలకు వెళ్ళాడు విక్రమ్. డయల్ చేశాడు. అవతలివైపు ఫోన్‌ను ఎవరో తీశారు.

రాజు బూత్ వెనుక చీకట్లో నిలబడి ఉన్నాడు.

"బాస్, మోసం జరిగింది"

"ఏమయ్యింది?"

"సేట్ చందన్‌లాల్ ఆ ఎనిమిది వజ్రాలను మీరు చెప్పినట్టుగా తన గదిలో ఉన్న సేఫ్‌లో ఉంచలేదు. పావులో ఉంచాడుట. పది వేలు డబ్బు దొరికింది సేఫ్‌లో."

"డామిట్....అలా జరగటానికి వీల్లేదు. సేట్ ఆ వజ్రాలను తన ఇంట్లో సేఫ్‌లోనే దాచి వుంచాడని

నాకు గట్టిగా ఇన్ఫర్ మేషన్ వచ్చింది."

"తర్వాత సేట్ వాటిని సేఫ్‌లోనించి తీసి షాపులో ఉంచాదేమో!"

"నో....కోటి రూపాయల విలువైన ఆ వజ్రాలను సేట్ షాపులో ఉంచడు. ఇంట్లోనే ఎక్కడో దాచి ఉంటాడు. మీరు అడగలేదా?"

"అడిగాం. చెప్పలేదు. తప్పించుకునే ప్రయత్నం చేశాడు. పిస్తోలుతో కాల్చి అక్కడినించి పారిపోయి వచ్చేశాం. అప్పటికే సేట్ ఇంట్లో ఎవరో నిద్రలేచారు."

కోపంగా అన్నాడు బాస్ "నా ప్లానంతా నాశనం అయ్యింది. ఆల్ రైట్ .... మీరిద్దరూ మన స్థావరానికి వచ్చెయ్యండి."

"బాస్ .... వెంటనే రావటానికి కుదరదు. ఇప్పుడే సేట్ ఇంటివైపు రెండు పోలీసు జీపులు వెళ్ళటం చూశాము. అంటే యెవరో పోలీసులకు ఫోన్ చేసి ఉంటారు. అందువల్ల తెల్లవారేలోపల అక్కడకు చేరు కుంటాం."

బాస్ ఫోన్ పెట్టేశాడు.

విక్రమ్ బయటకు వచ్చి చీకట్లో నిలబడివున్న రాజాను చూశాడు.

"ఏమన్నాడు బాస్?" ఆత్రంగా అడిగాడు రాజా.

"నా మాటలు నమ్మేశాడు. ఇంతకీ సేట్ ఇంటివైపు పోలీసు జీపులు ఎందుకు వెళ్ళాయి? సేట్ చచ్చిపోలేదా? మనం చూసి వుండాల్సింది. చందన్‌లాల్ బతికివుంటే మనల్ని గురించి పోలీసులకు వర్ణించి చెబుతాడు. అందు వల్ల మనం చిక్కుల్లో ఇరుక్కోవలసి వుంటుంది" అన్నాడు విక్రమ్.

"అవును. ఆ విషయం గురించి తర్వాత ఆలోచిద్దాం. ముందు మనం వజ్రాలను పంచుకుందాం. చెరి నాలుగు వజ్రాలు అంటే ఒక్కొక్కరికి యాభై లక్షలు. అదృష్టం అంటే ఇలా వుండాలి. ఈ పనికి బాస్ మనల్ని పంపించటం మన లక్" అన్నాడు రాజు.

"లక్ అంటే మనదే. మనం సంపాదించి బాస్ చేతిలో వుంచటం నిజంగా అవివేకం. ఈ వజ్రాలను మనం ఏ విదేశీయుడికైనా సులభంగా అమ్ముకోవచ్చు. ముందు నా గదికి వెళదాం. వజ్రాలను దాచి వుంచి బాస్ దగ్గరకు వెళ్ళాలి. అక్కడ మనం జాగ్రత్తగా వ్యవహరించాలి" అన్నాడు విక్రమ్.

తల వూపాడు రాజు.

కొంత సేపటికి ఇద్దరూ విక్రమ్ గదికి వెళ్ళారు. అక్కడ ఎవ్వరూ తెలుసుకోలేని రహస్య ప్రదేశంలో ఆ ఎనిమిది వజ్రాలనూ దాచి వుంచారు.

అక్కడే కొంచెం విస్కీ సేవించారు.

కొంచెం సేపు ఆ వజ్రాలను అమ్మి ఆ డబ్బుతో యే దేశానికి పారిపోవాలో చర్చించుకున్నారు.

ఆ పైన ఓ గంటకు బాస్ పావరాన్ని చేరుకున్నారు. అప్పుడు తెల్లవారటానికి ఇంకో అరగంట సమయముంది.

బాస్ ఈ ఇద్దరికోసమే ఎదురుచూస్తున్నాడు. అతన్ని కలుసుకున్నారు వెళ్ళగానే—

ఆ ఇద్దరూ బాగా నమ్మకమైన మనుషులుగా బాస్ దృష్టిలో ఓ ఆలోచన వున్నందువల్ల అనుమానించలేదు.

సేఫ్‌లో దొరికిన పదివేలూ బాస్‌కు ఇచ్చాడు విక్రమ్.

తనకు దొరికిన రెండు బంగారు గొలుసులను కూడా బాస్‌కు ఇచ్చాడు రాజు.

"ఐతే సేట్ చందన్‌లాల్ ఆ ఎనిమిది వజ్రాలనూ షాపులో వుంచాడని చెప్పాడన్నమాట" అన్నాడు బాస్ చుట్టపొగ వదులుతూ.

"అవును బాస్" అన్నాడు రాజు.

"ఐతే.... షాపు దోపిడీకి ముహూర్తం పెట్టాలి."

"త్వరగా పెట్టండి బాస్. ఆలస్యమైతే ఆ వజ్రాలను మరెక్కడైనా దాచే అవకాశం వుంది" అన్నాడు విక్రమ్—

తెల్లవారింది.

బయట ప్రపంచంలో న్యూస్ పేపర్లు రిలీజైనాయి. వాటిల్లో సేట్ చందన్‌లాల్ ఇంట్లో ఇద్దరు దొంగలు కోటిరూపాయల వజ్రాలను అపహరించుకు పోయారని పోలీసులకు చెప్పి చందన్‌లాల్ ప్రాణాలు వదిలాడనే వార్త వుంది.

ఆ ఇద్దర్లో ఒకడు పిస్తోలుతో రెండుసార్లు కాల్చాడనీ ఇద్దరిలో ఒకడు పొడుగ్గా వున్నాడనీ—రెండోవాడు పొట్టిగా వున్నాడనీ వాళ్ళని వర్ణించి పోలీసులకు చెప్పాడని కూడా వుంది.

న్యూస్ పేపర్లు బయటకొచ్చిన పదినిమిషాలకు బాస్‌కు ఓ ఫోన్ కాల్ వచ్చింది.

ఎవరో మాట్లాడారు.

ఫోన్‌లో మాట్లాడుతున్నప్పుడే బాస్ కళ్ళు ఎర్రగా మారిపోయాయి. పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

వెంటనే ఫోన్ పెట్టేసి విక్రమ్‌ను రాజును పిలిపించాడు.

ఎదురుగా నిల్చున్నారు—బాస్ ముహం చూడటం

తోనే ఇద్దరూ ఏదో వార్త బాస్‌కు చేరిందని తెలుసు కున్నారు.

"ఆ వజ్రాలు యెక్కడ దాచారు?"

"బాస్!" ఆశ్చర్యంగా అన్నాడు విక్రమ్.

"నటించకండి....ఆ వజ్రాలు సేట్ దగ్గర్నించి తీసు కున్నారు. సేట్‌ను కాల్చి వచ్చేశారు. చందన్‌లాల్ చావలేదు. పోలీసులను ఫోన్ చేసి పిల్చి మీ ఇద్దరి గురించి వజ్రాల గురించీ చెప్పి చచ్చిపోయాడు. కాబట్టి—మర్యాదగా ఆ వజ్రాలను ఇచ్చెయ్యండి" అన్నాడు బాస్.

"మమ్మల్ని నమ్మండి బాస్. చావబోయే ముందు సేట్ మా ఇద్దరిమీదా కసి తీర్చుకునేందుకు పోలీసులతో ఆ వజ్రాలను మేము తీసుకున్నామని చెప్పి వుంటాడు. నిజంగా వాటిని మాకు ఇవ్వలేదు" అన్నాడు రాజు.

అంతే—

అతని మొహం అదిరిపోయింది.

కూలి వెనక్కి పడిపోయాడు.

అతన్ని లేవదీసి డొక్కలో పిడికిలితో బలంగా పొడిచాడు బాస్.

బాధగా అరిచాడు రాజు.

ఐనా నిజం చెప్పలేదు.

"విక్రమ్, మీ ఇద్దరూ నమ్మకమైన మనుషులని ఈ పనికి మిమ్మల్ని పంపాను. మీరు నాకే ద్రోహం చెయ్యాలని చూశారు. ఇప్పటికైనా ఆ వజ్రాలను తెచ్చి ఇవ్వండి. మిమ్మల్ని క్షమించి ప్రాణాలతో వదులుతాను. లేకపోతే మిమ్మల్ని రకరకాలుగా హింసించి మీ చేతే ఆ నిజాన్ని చెప్పిస్తాను" అన్నాడు.

"బాస్, మిమ్మల్ని ఎలా నమ్మించాలో మాకు తెలీటం లేదు. ఎన్నో యేళ్ళుగా మీ దగ్గర పనిచేస్తున్నాం. మా గురించి మీకు తెలుసుకదా? ఆ ఇడియట్ సేట్ మా కొంప ముంచాడు—వాడ్ని కాల్చినందుకు" అన్నాడు విక్రమ్.

"ఇడియట్!"

ఈడ్చి విక్రమ్ చెంపమీద కొట్టాడు బాస్.

పక్కకు పడిపోయాడు విక్రమ్.

"డర్టీ డాగ్స్....మీ ఇద్దరి అంతూ చూస్తాను. కోటి రూపాయల వజ్రాలను మాయం చేస్తారా?"

ఐదు నిమిషాల్లో బాస్ ఆజ్ఞ మీద ఇద్దరు అనుచరులు విక్రమ్‌నీ రాజునీ నైలాన్ తాళ్ళతో చేతులను వెనక్కు విరిచి కట్టేశారు.

అప్పుడు బాస్ పొడుగాటి కొరడా తీసుకుని ఇద్దరినీ ఆ వజ్రాల గురించి చెప్పమని బాగా హింసించాడు.

ఎంతగా హింసించినా ఆ ఇద్దర్లో యే ఒక్కరూ నోరు తెరవలేదు. స్పృహ తప్పిపోయారు.

3

విక్రమ్—రాజు వాళ్ళిద్దరికీ కాపలాగా అక్కడ ఓ దున్నపోతులాంటి మనిషి కుర్చీలో కూర్చుని వున్నాడు.

వాడి ఆలోచనలు ఆ సమయంలో కోటిరూపాయలు ఖరీదుచేసే ఆ ఎనిమిది వజ్రాల గురించే వున్నాయి. వాటిల్లో ఒక్క వజ్రం తను సంపాదించగలిగినా తన జాతకం మారిపోతుంది.

ఎలాగైనా బాస్‌కంటే ముందుగా ఆ ఇద్దరి దగ్గిర్నించీ ఆ వజ్రాలు యెక్కడ వున్నాయో తను తెలుసుకోవాలనుకున్నాడు.

అతని పేరు జాకబ్.

అందుకే ఆ ఇద్దరికీ స్పృహ వచ్చేవరకూ అక్కడే కాచుకుని వున్నాడు.

ఎప్పటికో వాళ్ళకు స్పృహ వచ్చింది.

"దాహం.... దాహం" అని అరిచారు ఇద్దరూ—

వెంటనే వాళ్ళకు జగ్‌తో నీళ్ళు తాగించాడు జాకబ్.

"థాంక్స్" అన్నారు.

"ఊరికే థాంక్స్ చెబితే చాలదు. మీరు తెలివిలోకి రాగానే మిమ్మల్ని ఎన్ని రకాల హింసలయినా పెట్టి, మీ చేత ఆ రహస్యాన్ని చెప్పించమని బాస్ నాకు చెప్పి వెళ్ళిపోయాడు. కాని నేను అన్ని హింసలను పెట్టదల్చుకోలేదు. ఎందుకంటే మీరుకూడా బాస్ అనుచరులే. మనందరం ఒకేచోట పనిచేస్తున్నాం. అందువల్ల వెంటనే ఆ వజ్రాలను ఎక్కడ దాచివుంచారో చెప్పెయ్యండి" అన్నాడు జాకబ్.

"ఏమిటీ? మేము అబద్ధం చెబుతున్నామని నువ్వుకూడా నమ్ముతున్నావా?" అన్నాడు రాజు.

"నేనే కాదు. ఎవరైనా నమ్ముతారు. చావబోయే మనిషి యెప్పుడూ అబద్ధం చెప్పడు. ఆ వజ్రాలను మీరు తీసుకుపోయారని సేట్ చందన్‌లాల్ పోలీసులకు చెప్పిన తర్వాతనే చచ్చిపోయాడట. కాబట్టి మీరు ఆ వజ్రాలను కొట్టెయ్యటానికి ఈ ప్లాను ఆలోచించారు. అవును కదూ?"

"కాదు. అంతా అబద్ధం. చందన్‌లాల్ మా ఇద్దరి మీదా వున్న కోపంతో పోలీసులకు అలా చెప్పాడు. నిజం మా ఇద్దరికే తెలుసు."

"అవును. నిజం మీ ఇద్దరికే తెలుసు—ఆ వజ్రాలను

యెక్కడ దాచివుంచారో .... త్వరగా చెప్పండి. ఐనా కష్టపడి మీరు సంపాదించిన అంత విలువైన వజ్రాలను తెచ్చి బాస్‌కు అప్పగించాలంటే మీకు బాధగానే వుంటుంది. మీతో కలిసి నేను కూడా వచ్చి వుంటే నేనుకూడా ఇలాగే చేసేవాడిని" అన్నాడు జాకబ్ సిగరెట్టు వెలిగించి—

జాకబ్ మాటలకు వాళ్ళు ఆశ్చర్యపడ్డారు.

"అందుకే—నువ్వు నిజంగానే ఇలా అంటున్నావా? లేక బాస్ నిన్ను మామీద గూఢచారిగా వుంచివెళ్ళాడా? కూపీలాగటానికి" అనడిగాడు రాజు.

"నిజంగానే అంటున్నాను బ్రదర్. కష్టమంతా మనది. రిస్కు తీసుకునేది మనం. సంపాదించినదాన్ని అనుభవించేది బాస్. ఇది అన్యాయం. మనందరం ఒకటి. బాస్ మన శ్రమను దోచుకుంటున్నాడు. అందుకే మనం బాస్‌ను మోసగించాలి."

ఒకర్నొకరు చూసుకున్నారు—విక్రమ్—రాజు.

"నీ మాటల్ని నమ్మలేకుండా వున్నాం."

"నన్ను నమ్మకపోతే మీకే నష్టం... ఆ రహస్యాన్ని చెప్పేవరకు బాస్ మిమ్మల్ని ప్రాణాలతో వదలడు. బాస్ గురించి మీకూ తెలుసు. బాస్ మొండిమనిషి."

"ఐతే... ఇంతకీ నువ్వనేదేమిటి?" అడిగాడు విక్రమ్.

"మీరు దాచిన వజ్రాల రహస్యం నాకు తెలియజెయ్యాలి."

"అందువల్ల మాకు ప్రయోజనం యేమిటి?"

"ఆ వజ్రాలు నా చేతికి రాగానే నేను వచ్చి మిమ్మల్ని వదిలించి ఇక్కడినించి తప్పిస్తాను. ఆ వజ్రాలను ముగ్గురం పంచుకుందాం."

"ఇలా జరగదు జాకబ్. నిన్ను నమ్మటంవల్ల చెబుతున్నాను. ఆ వజ్రాలను ఎక్కడ దాచివుంచినదీ నీకు చెప్పినా నువ్వు తెలుసుకోలేవు. అందువల్ల నువ్వు మమ్మల్ని ఇక్కడినించి బయటకు తీసుకువెళ్ళు. వెళ్ళిన తర్వాత ఆ వజ్రాలను ముగ్గురం పంచుకుని వాటిని అమ్ముకుని ఎటైనా పారిపోదాం...." అన్నాడు విక్రమ్.

సిగరెట్ని విసిరి కొంచెంసేపు ఆలోచించాడు జాకబ్. విక్రమ్ చెప్పిన ఆలోచన బావున్నట్టుగానే అనిపించింది.

"బయటకు వెళ్ళగానే మీ రిద్దరూ నన్ను మోసం చేస్తే?" అనుమానంగా అడిగాడు.

"చెయ్యం. మన ముగ్గురం ఒకటి. మనం ఈ పరిస్థితుల్లో ఒకరొన్నొకరు నమ్మక తప్పదు."

జాకబ్ వాళ్ళిద్దరి కట్లు వూడదీశాడు.

ముగ్గురూ ఆ స్థావరంలోనించి జాగ్రత్తగా బయట పడ్డారు. అక్కడినించి విక్రమ్ గదిని చేరుకున్నారు.

"ఈ గదిలోనే వజ్రాలను దాచివుంచారా?" అడిగాడు జాకబ్.

"అవును. ఆ అటకమీద చిన్న ప్లాస్టిక్ పెట్టె వుంటుంది. దాన్ని కిందికి దించు. అందులోనే ఇంకో చిన్న పెట్టెలో వున్నాయి" అన్నాడు రాజు.

వెంటనే జాకబ్ అక్కడే ఉన్న టేబుల్ మీదకు ఎక్కటానికి వెనక్కు తిరిగాడు.

అంతే—విక్రమ్ చేతిలో ప్రత్యక్షమైన సైలెన్సర్ అమర్చిన పిస్తోలు ఒకే ఒక్కసారి పేలింది. గుండు జాకబ్ వెన్నులోనించి దూసుకు వెళ్ళింది. జాకబ్ చిన్నగా మూల్గి వెనక్కు విరుచుకు పడిపోయాడు.

"క్విక్.... టైమ్ లేదు. ముందు మనం ఇక్కడినించి

బయటపడాలి. మనం పారిపోయామని తెలియగానే బాస్ మనకోసం వేటకుక్కల్ని వదులుతాడు" అరిచాడు రాజు.

అప్పటికప్పుడే జాకబ్ శవాన్ని బాత్‌రూమ్‌లోకి ఈడ్చి లాక్ చేశారు.

ఆ తర్వాత ఐదు నిమిషాలకు ఇద్దరూ కావలసినవన్నీ రెండు బ్యాగ్‌లలో సర్దుకుని ఆ ఎనిమిది వజ్రాలతో ఆ గదినించి బయటపడ్డారు.

4

ఎక్స్‌ప్రెస్ ట్రెయిన్ బయల్దేరటానికి సిద్ధంగా వుంది. సిగ్నల్ కూడా ఇవ్వబడింది.

ట్రెయిన్ నిండా క్రిక్కిరిసి వున్నారు జనం.

విక్రమ్—రాజు పరిగెత్తుకుంటూ అప్పుడే స్టేషన్‌లోకి ప్రవేశించారు.

సరిగ్గా అప్పుడే ట్రెయిన్ బయల్దేరింది. కొంచెం కూడా ఆలస్యం చెయ్యకుండా రివ్వున పరిగెత్తుకుంటూ వెళ్ళి కదులుతున్న ట్రెయిన్‌లోకి ఎక్కేశారు.

వాళ్ళు ఎక్కగానే రైలు వేగాన్నందుకుంది.

ఎంట్రెన్స్ డోర్ దగ్గర నిల్చుని ఒక్కసారి ఇద్దరూ వెనక్కి తిరిగి చూశారు.

ప్లాట్‌ఫారంమీద ఉస్మాన్ పరిగెత్తుకుంటూ వస్తున్నాడు.

"మై గాడ్. ఉస్మాన్ మనల్ని చూశాడు. పరిగెత్తుకొస్తున్నాడు" అన్నాడు రాజు కంగారుగా.

"భయంలేదు. వాడు ఈ ట్రెయిన్‌ని అందుకోలేడు. అంతేకాదు. ఈ రైలు మూడొందల కిలోమీటర్లు వెళ్ళే వరకూ ఎక్కడా ఆగదు. అందువల్ల మనకు వాడివల్ల

ప్రమాదంలేదు" అన్నాడు విక్రమ్.

వాళ్ళు చూస్తుండగానే రైలు దూరమయిపోయింది.

ఉస్మాన్ ప్లాట్ ఫారం చివరి వరకూ వచ్చి ఆగి పోయాడు. అతను బాస్ అనుచరుల్లో ఒకడు. అతనే సేట్ చందన్ లాల్ ఇంట్లో వజ్రాల దొంగతనం గురించి బాస్ కు ఇన్ఫర్మేషన్ ఇచ్చాడు.

ట్రెయిన్ లో విక్రమ్ రాజా లోపలకు జనాన్ని నెట్టు కుంటూ వెళ్ళారు. ఓ ఇద్దరు మనుషులను బెదిరించి ఎలాగో సీట్లు సంపాదించుకున్నారు. వాళ్ళ అదృష్టంకొద్దీ జనరల్ బోగీలో ఎక్కారు. అందువల్ల టిక్కెట్లు ఎగ్జామిన్ చెయ్యటానికి ఎవ్వరూ రాలేదు.

కొంచెం సేపటికి ఇద్దరికీ నిద్రపట్టింది బాస్ కొట్టిన దెబ్బలు మంటగా అనిపిస్తున్నా.

తిరిగి వాళ్ళకు మెలకువ వచ్చేసరికి తెల్లవార బోతున్నది.

ఆగివున్నది ట్రెయిన్.

ఎదురుగా ట్రాక్ రిపేర్ లో వుంది. అందువల్ల మళ్ళీ నెమ్మదిగా కదులుతోంది రైలు.

"ఇక్కడ దిగిపోదాం" అన్నాడు రాజు.

"ఎందుకు?"

"మనం ఈ ట్రెయిన్ లో ఎక్కి పారిపోతున్నట్టు బాస్ కు ఉస్మాన్ తెలియజేస్తాడు. ఈ ట్రెయిన్ ఎక్కడ ఆగుతుందో బాస్ కు తెలుసు కాబట్టి అక్కడ మనకంటే ముందుగానే బాస్ కార్లో వెళ్ళి మనకోసం యెదురు చూస్తూ వుంటాడు. అందువల్ల మనం ఇక్కడే దిగి పోదాం."

"గుడ్ ఐడియా ....పద...."

ఇద్దరూ దిగారు అక్కడే.

కొంచెం సేపటి తర్వాత రైలు వేగంగా కదిలి వెళ్ళిపోయింది.

వెనక్కు తిరిగి చూశారు.

కొంచెం దూరంలో చిన్న స్టేషన్ కనపడుతోంది. అక్కడ అంతగా ఎత్తుగా లేని ప్లాట్ ఫారంమీద జనం అటూ ఇటూ తిరుగుతున్నారు.

"ఆకలిగా వుంది" అన్నాడు రాజు.

"స్టేషన్ లో కాంటీన్ వుంటుంది" అన్నాడు విక్రమ్.

ఐదు నిమిషాల్లో ఇద్దరూ ఆ స్టేషన్ లో ఉన్నారు. క్యాంటీన్ వుంది.

కొంచెం సేపట్లో రాబోయే ప్యాసింజర్ రైలుకోసం ప్రయాణీకులు ఎదురుచూస్తున్నారు.

టిఫిన్ తిని సిగరెట్లు వెలిగించారు రాజు—విక్రమ్.

"ఇప్పుడు మనం ఎక్కడికి వెళ్ళాలి?" అడిగాడు విక్రమ్ పొగ వదులుతూ—

"ఆ విషయం గురించే నేనూ ఆలోచిస్తున్నాను. ఈ బయట నాగరిక ప్రపంచంలో మనం యెక్కడ దాక్కున్నా బాస్ మనల్ని పట్టుకుంటాడు. వేటకుక్కల్లాంటి అనుచరులందర్నీ మనమీదకు వదులుతాడు. ఇప్పుడు మన దగ్గర కోటిరూపాయలు విలువచేసే ఎనిమిది వజ్రాలున్నాయనే విషయం బాస్ పూర్తిగా తెలుసుకుని వుంటాడు. కాబట్టి కొన్ని రోజులు మనం ఎక్కడైనా అజ్ఞాతవాసం చెయ్యాలి. ఆ తర్వాత మనం ఈ దేశం వదిలి పారిపోవాలి...."

వాళ్ళలా మాట్లాడుకుంటున్నప్పుడే రైలుపట్టాల పక్కనే ఉన్న మట్టి రోడ్డుమీద దుమ్ములేపుకుంటూ

వస్తున్న లారీని ఎవరో ఇద్దరు మనుషులు ఆపుచేశారు. అందులోనించి ఎవరో లావుగా ఉన్నాయన కిందికి దిగి కొంచెం పక్కగా వాళ్ళిద్దరినీ తీసుకెళ్ళాడు.

జేబులోనించి పర్సుతీసి అందులోనించి ఎంతో డబ్బు తీసి వాళ్ళిద్దరికీ ఇచ్చాడు. వాళ్ళు నవ్వుకుంటూ వెళ్ళి పోయారు.

కొన్ని నిమిషాల తర్వాత ఆ లారీ దుమ్ము లేపుకుంటూ వెళ్ళిపోయింది.

ఆ లారీ నిండుగా ముక్కలుగా నరికిన పెద్ద పెద్ద చెట్ల బోదెలు వున్నాయి.

"వాళ్ళిద్దరు ఎవరు? ఆ లారీని ఎందుకు ఆపారు?" అడిగాడు రాజు తమకు కొంచెం దూరంలో నిలబడిన మనిషిని.

"వాళ్ళు అడవిలోనించి కలప నరుకుని తోలు కెళుతున్నారు. ఆ ఇద్దరు ఫారెస్టు డిపార్టుమెంటు మను షులు. లంచం తీసుకుని లారీని వదిలేశారు. వీళ్ళకు ఇది మామూలే" అన్నాడు.

రాజు కళ్ళు మెరిశాయి అడవి అనగానే. మెరుస్తున్న కళ్ళతోనే విక్రమ్‌ని చూశాడు.

"ఇక్కడకు అడవి ఎంతదూరంలో వుంది?" అడి గాడు విక్రమ్ అతడ్ని.

"ముప్ఫయ్ మైళ్ళు వుంటుంది."

"బాగా పెద్ద అడవేనా?" రాజు అడిగాడు.

"అవును. ఎన్నో మైళ్ళవరకు వుంది. క్రూరజంతువులు కూడా వున్నాయంటారు. ఎందుకు ఇదంతా అడుగు తున్నారు? అడవితో మీ కేమిటి పని?"

"మేమిద్దరం కొన్ని రకాల మొక్కలను గురించి పరి

శోధనలు చేస్తున్నాం. అందుకే యిక్కడికి వచ్చాం"
అన్నాడు రాజు వెంటనే.

"అలాగా?" అన్నాడు అతను.

ఇంతలోనే రైలు రావటానికి సూచనగా స్టేషన్లో
గంట కొట్టారు.

"అడవిలోకి వెళ్ళే దారి యేమిటి?" విక్రమ్ అతన్నే
అడిగాడు.

"కొంచెం దూరం ఈ రోడ్డునే వెళితే ఓ జంక్షన్
వస్తుంది. అక్కడ నిలబడితే కలపకోసం అడవిలోకి
వెళ్ళే లారీలు వస్తాయి. వాటిల్లో ఎక్కి వెళ్ళొచ్చు" అని
అతను వెళ్ళిపోయాడు.

"మన అదృష్టం. బాప్ బారినించి తప్పించుకోటానికి
మనకు ఇక్కడ ఓ అడవి దొరికింది" అన్నాడు విక్రమ్
సంతోషంగా—

"అవును. ఇక మనం ఆలస్యం చెయ్యటం ఎందుకు?
నలుగురి దృష్టిలో ఎక్కువసేపు వుండటం కూడా అంత
మంచిదికాదు. పద. వెళ్ళిపోదాం" అన్నాడు రాజు
చిన్నగా.

విక్రమ్ మాట్లాడకుండా అక్కడినించి కదిలాడు.

ఇద్దరూ మట్టిరోడ్డుమీదకు వచ్చారు.

అప్పుడే సూర్యుడు ఉదయిస్తున్నాడు.

పల్చని ఎండ వాళ్ళమీద పడుతోంది. వాళ్ళ నీడలు
రోడ్డుమీద సాగుతున్నాయి.

వాళ్ళు కొంతదూరం వెళ్ళగానే వెనుకనించి అప్పుడే
రైలు వచ్చిన మోత వినిపించింది.

"ఈ రైలు ఎక్కడినించి వచ్చిందో?" అన్నాడు
రాజు గబగబా నడుస్తూ—

"ఎందుకు?"

"ఎవరయినా మనల్ని వెంటాడుతూ ఈ రైల్లో వచ్చారేమో!"

"అసాధ్యం....ఇది ప్యాసింజర్ రైలు. ఎక్స్‌ప్రెస్ రైళ్ళు యింత చిన్న స్టేషన్లో ఆగవు. అందువల్ల మనకు భయం లేదు."

పది నిముషాల తర్వాత అతను చెప్పిన జంక్షన్ దగ్గరకు చేరుకున్నారు. అక్కడే ఇంకో రెండు రోడ్లు వచ్చి కలుస్తున్నాయి.

అరగంట కాలం ఎదురుచూసిన తర్వాత అక్కడకు ఓ లారీ వచ్చింది.

చెయ్యెత్తి ఆపాడు విక్రమ్.

"ఎవరు? ఎక్కడకు వెళ్ళాలి? ఈ లారీ అడవిలోకి వెళుతోంది" అన్నాడు డ్రయివర్.

"మేం కూడా అడవిలోకి వెళ్ళాలి."

"ఎందుకు?"

"కొన్ని రకాల వనమూలికలు కావాలి."

"లోపల ఖాళీ లేదు. పైన ఎక్కండి" అన్నాడు డ్రయివర్.

అప్పుడప్పుడు మూలికల కోసం—ఆకుల కోసం కొంత మంది మనుషులు అడవిలోకి వస్తుంటారని డ్రయివర్‌కు తెలుసు. అందుకే అతను ఆ ఇద్దరి మాటలనూ సులభంగా నమ్మేశాడు.

నవ్వుకున్నారు పైన కూర్చుని.

"ఇప్పటివరకూ అంతా సవ్యంగానే జరుగుతోంది. కొన్ని రోజులు మనం ఎలాగో ఈ అడవిలోనే గడిపెయ్యాలి. మనం ఈ దేశంనించి పారిపోయామని బాస్

మనకోసం వెతకటం మానేస్తాడు. అప్పుడు మనం బయ టకు వచ్చి ఈ వజ్రాలను అమ్ముకుని ఆ డబ్బుతో యీ దేశం వదలి పారిపోవాలి" చిన్నగా అన్నాడు విక్రమ్.

5

లారీ వేగంగా వెళుతుంటే దుమ్ము రేగుతోంది.

పావుగంట గడిచేసరికి లారీ ఎత్తుగా పెరిగిన చెట్ల మధ్యనించి వెళ్ళటం గమనించి "అప్పుడే అడవి మొద లయ్యింది" అన్నాడు రాజు ఉత్సాహంగా.

చూస్తుండగానే లారీ కొంచెం దట్టంగా వున్న అడవి లోకి ప్రవేశించింది.

ఇంకో అరగంట తర్వాత లారీ ఆగిపోయింది. అక్కడ కొంతమంది పెద్ద పెద్ద చెట్లను నరుకుతున్నారు.

అంతా కిందికి దిగారు.

విక్రమ్—రాజు కిందకు దిగగానే "లారీ యిక్కడే ఆగిపోతుంది....ఇక్కడన్నీ పెద్ద పెద్ద చెట్లే. ఇంకొంచెం లోపలకు వెళ్ళండి. మీకు కావలసిన మూలికలు దొరుకు తాయి" అన్నాడు డ్రయివర్.

తల వూపి అక్కడనించి కదిలారు.

నవ్వాడు విక్రమ్.

"మనల్ని బాగా నమ్మారు. మన దగ్గర కోటి రూపా యల వజ్రా లున్నాయని ఈ అమాయకులకు ఏం తెలుసు? నిజంగానే వనమూలికలకోసం వచ్చామని అనుకుంటు న్నారు. వీళ్ళు మనల్ని ఇంత ఈజీగా నమ్మేశారంటే యెవరో తరచుగా ఈ అడవిలోకి వనమూలికల కోసం వస్తూ వుండాలి."

"అవును. అందువల్లనే మనల్ని ఎవరూ అనుమానించ లేదు" అన్నాడు రాజు సిగరెట్టు వెలిగించుకుంటూ.

చలికాలం కావటంతో ఎండ అంత గా లేదు. ఉన్నదో లేదో కూడా వాళ్ళకు తెలీటం లేదు. ఎందుకంటే దట్టంగా వున్న ఆ అడవిలో చెట్లు విశాలంగా కొమ్మలు పరచుకుని పెరిగివున్నాయి.

వాచీ కేసి చూసుకున్నాడు రాజు.

తొమ్మిది గంటలు కావస్తోన్నది.

పదకొండు గంటలయ్యేవరకూ ఇద్దరూ కబుర్లు చెప్పు కుంటూ అడవిదారి వెంట చెట్లని చూసుకుంటూ భవి ష్యత్తు గురించి ఆలోచనల్లో మునిగిపోతూ నడిచారు.

ఒకచోట ఆగిపోయారు.

అక్కడ ఆ దారి రెండుగా చీలిపోయింది. ఏ వైపుకు వెళ్ళాలో నిర్ణయించుకోటానికి అక్కడే ఆగిపోయారు.

అప్పుడే వాళ్ళకు ఓ దారిలోనించి వస్తున్న జీపు కని పించింది. రెండు నిముషాల తర్వాత జీపు వాళ్ళదగ్గరకు వచ్చి ఆగిపోయింది.

అందులో ముగ్గురు మనుషులు యూనిఫారంలో వున్నారు. ఆ ముగ్గురిలో ఒకాయన ఫారెస్ట్ ఆఫీసర్. ఆ క్రితంరోజునే ఆయన అడవిలో వున్న ఫారెస్టు హావుస్ లోకి భార్యతో కలిసివచ్చాడు—

"ఎవరు మీరు?" అడిగాడాయన.

"నా పేరు శేషాచారి. ఇతని పేరు గరుడాచారి. కొన్ని రకాల మూలికలు, ఆకులకోసం యిక్కడికి వచ్చాం" అన్నాడు విక్రమ్ ఎంతో వినయంగా—

"ఓహో.... వైద్యులా.... జాగ్రత్తగా వెళ్ళండి. మరీ లోపలగా వెళ్ళకండి. క్రూరజంతువులు వున్నాయి ఈ అడవిలో. ఒకవేళ మీరు రాత్రికి కూడా వుండవలసి వస్తే ఇక్కడికి కొంతదూరంలో వున్న మా హావుస్ కు

రండి. బస చెయ్యవచ్చు. మాకూ కొంత కాలక్షేపంగా వుంటుంది" అన్నాడాయన.

తల వూపాడు విక్రమ్ సరేనంటూ—

ఆయనకు నలభై యేళ్ళుంటాయి—లావుగా పొడుగ్గా బలంగా వున్నాడు.

జీపు వెళ్ళిపోయింది.

"చివరకు మనల్ని ఫారెస్టు ఆఫీసర్ కూడా వనమాలి కలు కోసం వచ్చినట్టుగా అనుకున్నాడు. ఇక మనకు యేలాంటి భయంలేదు" అంటూ నవ్వాడు రాజు.

మళ్ళీ నడిచారు.

వాళ్ళకు ఒక్క క్రూరమృగం కూడా కనిపించలేదు. ఎక్కడో రెండు చెట్లమీద నాలుగు కోతులు కనిపించాయి.

6

"ఆకలిగా వుంది" అన్నాడు రాజు.

"అవును. ఇంతదూరం నడవటంవల్ల నాకూ ఆకలిగా వుంది" అన్నాడు విక్రమ్.

దారిపక్కనే వున్న పెద్ద చెట్టుకింద కూర్చుని ఇద్దరూ బ్రెడ్ తిన్నారు. తర్వాత బాటిల్లోని నీళ్ళు తాగారు.

"నాకు కొంచెంసేపు రెస్టు తీసుకోవాలని వుంది" అన్నాడు రాజు.

"ఇక్కడెందుకు? కొంచెందూరంలో తన ఫారెస్టు హావుస్ వుందని ఆయన చెప్పాడు. వెళ్ళి అక్కడే మనం రెస్టు తీసుకోవచ్చు."

లేచి నిల్చున్నారు.

దార్లో అన్నాడు విక్రమ్—

"మనిద్దరికోసం ఒకవైపు పోలీసులు, మరోవైపు

బాస్ గాలిస్తూ వుంటారు."

రాజు నవ్వి "వాళ్ళకేం తెలుసు—మనిద్దరం ఈ క్షణాల్లో ఈ చిట్టడవిలో చెట్లకింద నడుస్తున్నామని. మన ఉనికి దేవుడుకూడా తెలుసుకోలేడు" అన్నాడు.

"అలా అనకు నువ్వు. బాస్‌ను తక్కువగా అంచనా వెయ్యకు. బాస్‌కు లక్ష కళ్ళు. అందువల్ల అడవిలో వున్నా మన జాగ్రత్తలో మనం వుండాలి."

"నిజమే" రాజు అన్నాడు.

కొంచెం దూరంలోనే వాళ్ళకు చెట్లమధ్యగా చిన్న ఇల్లు కనిపించింది. దాన్నే ఫారెస్టు హావుస్ అనుకున్నారు.

దగ్గరకు వెళ్ళేసరికి దాని చుట్టూ తీగెతో ఫెన్సింగ్ వుంది. పెద్ద కొయ్యగేటు.

దాన్ని నెట్టుకుని లోపలకు వెళ్ళారు. అప్పుడు వరండాలో కూర్చుని చుట్ట కాల్చుకుంటున్న ముసలి నౌకరు కనిపించాడు.

"ఎవరు మీరు?" అనడిగాడు వాళ్ళని చూడటంతోనే.

అందరికీ చెప్పినట్టుగానే వాళ్ళు ఆ ముసలి నౌకరు కూడా చెప్పి "చాలా దూరంనించి నడిచివచ్చాం. అలసిపోయి వున్నాం. కొంచెం సేపు వరండాలో విశ్రాంతి తీసుకుంటాం" అని చెప్పాడు రాజు.

వాళ్ళ మాటలు విని కర్టెన్ తొలగించుకుని ఇంట్లో నించి అప్పుడే బయటకు వచ్చింది ముప్ఫయేళ్ళు దాటుతున్న ఓ స్త్రీ.

"ఎవరు?" అంటూ—

ఆమెను చూడగానే వాళ్ళిద్దరూ షాక్ కొట్టినట్లుగా ఐపోయారు.

ఎందుకంటే—ఆమె అందం అలాంటిది—

చెంపక చేర దేసి కళ్ళు—సన్నని ముక్కు. ఎర్రని పెదవులు—గులాబిరంగు కళ్ళు—ఆమెలో యెక్కువగా వున్న ఆకర్షణ.

ఎవరో ఆమెక్కూడా చెప్పి అక్కడ విశ్రాంతి తీసుకుంటామని చెప్పారు, కొంచెంసేపటి తర్వాత ఆ షాక్ నించి తేరుకుని.

తల వూపి ఆమె లోపలకు వెళ్ళిపోయింది ఫారెస్టు ఆఫీసర్ భార్య. ఆమెకు పిల్లలు లేరు.

టవల్స్ పరచుకుని వరండాలో పడుకున్నారు.

ఇంటిముందు ఎక్కువగా చెట్లు లేకపోవటంతో ఎండ బాగా పడుతోంది అక్కడ.

కళ్ళు మూసుకున్నా ఇద్దరి కళ్ళముందు ఆమె రూపమే కదులుతోన్నది. అందువల్ల వాళ్ళు విశ్రాంతి తీసుకోవాలనే ఆలోచన గురించే మరచిపోయారు.

కొంచెంసేపటి తర్వాత రాజు కళ్ళు తెరిచి చూసే ఆ ముసలి నౌకరుకూడా, కొంచెం దూరంలో ఏదో గుడ్డ పరుచుకుని ముడుచుకుని నిద్రపోతూ కనిపించాడు.

వెంటనే రాజు—విక్రమ్‌ను తట్టి చిన్నగా యేదో చెప్పాడు.

తల వూపాడతను.

క్షణంలో నిల్చున్నారు.

రాజు లేచివెళ్ళి తలుపుమీద చిన్నగా చప్పుడు చేశాడు.

రెండు నిమిషాల తర్వాత తలుపు తెరిచింది ఆమె.

కర్టెన్ లోనించి మొహం బయటకు పెంచి "ఏమిటి?" అన్నది.

"దాహంగా వుంది" అన్నాడు రాజు యెంతో మర్యాదగా.

ఆమె వెంటనే లోపలకు వెళ్ళింది.

చప్పుడవకుండా ఇద్దరూ ఆమె వెనుకే లోపలకు వెళ్ళారు.

ఆమె ఓ గదిలోకి నడిచి ఆగిపోయి కూజాలో వున్న నీళ్ళు గ్లాసులోకి వంచుతున్నప్పుడు వెనుకగా వెళ్ళి ఇద్దరూ ఒక్కసారి ఆమెను పట్టుకున్నారు.

ఉలిక్కిపడి వెంటనే పెద్దగా అరిచిందామె—ఐనా వాళ్ళు ఆమెను వదల్లేదు. విక్రమ్ అర చేత్తో ఆమె నోటిని మూశాడు.

కాని—అప్పటికే బయట పడుకున్న నౌకరుకు ఆమె కేక వినిపించి లోపలకు పరిగెత్తుకు వచ్చాడు.

వాళ్ళు ఆమెను లొంగదీసుకునే ప్రయత్నంలో వున్నారు.

ఆ దృశ్యాన్ని చూడగానే నౌకరు పెద్దగా అరుస్తూ దగ్గరలో వున్న కొయ్యను తీసుకుని వాళ్ళమీదకు వచ్చాడు.

ప్రమాదాన్ని రాజు గుర్తించాడు. క్షణంకూడా ఆలస్యం చెయ్యలేదు. ఎగిరి నౌకరుమీదకు దూకాడు. దూకుతూనే అతని చేతిలో వున్న కొయ్యను లాక్కుని నౌకరు తలమీద బలంగా కొట్టాడు. కాని నౌకరు తల పక్కకు తిప్పటంతో ఆ దెబ్బ అతని భుజంమీద పడింది. కెవ్వున అరిచి స్పృహతప్పి పడిపోయాడు.

"నువ్వు బయట నిలబడు. తర్వాత పిలుస్తాను" అన్నాడు విక్రమ్ ఆమె బలహీనపడిపోవటం గమనించి.

అతడి బలంముందు ఆమె ఓడిపోయింది.

రాజు బయట కెళ్ళాడు.

కొన్ని నిమిషాలు గడిచాయి.

రాజును పిల్చాడు విక్రమ్.

అతను బయటకు వెళ్లాడు.

ఇంకొన్ని నిమిషాలకు రాజు కంగారుగా బయటకు వచ్చాడు.

"ఆమె చచ్చిపోయింది" అన్నాడు భయంగా.

"మై గాడ్. క్విక్ ....మనం వెంటనే ఇక్కడినించి వీలైనంత దూరంగా పారిపోవాలి. ఇప్పటివరకూ మనం పోలీసుల గురించి, బాస్ గురించే భయపడుతున్నాం. ఇప్పుడు మనకు ఈ ఫారెస్ట్ ఆఫీసర్ కూడా శత్రువు. ఆయన మనల్ని వేటాడి చంపుతాడు. రన్ ఫర్ లైఫ్" ఆదుర్దాగా అన్నాడు విక్రమ్—

తర్వాత వాళ్ళు ఆ ఫారెస్టు హౌస్‌లోనించి బయట పడి ఇంటి వెనకవైపున వున్న అడవిదారిలోనించి పరుగు తీయటం మొదలుపెట్టారు-చావునించి తప్పించుకోటానికి-

కాని వాళ్ళకు చావు తప్పుతుందా?

7

దట్టంగా వున్న అడవి మధ్యలోకి చేరుకుని వుండ టంతో—చీకట్లు అలుముకున్నట్టుగా అనిపించి పైకు చూశాడు విక్రమ్.

ఐదుగంటలు దాటి ఇరవై నిమిషాలు.

ఎక్కడినించో సన్నగా వెలుతురు అస్పష్టంగా పడు తోంది.

"ఇప్పటికే మనం చాలాదూరం వచ్చేశాం" అన్నాడు రాజు బాగా ఆయాసపడుతూ.

"అవును. ఇక మనకు భయంలేదు. ఐనా చీకట్లో ముందుకు ప్రయాణం చెయ్యటం ప్రమాదం. ఈ రాత్రికి ఇక్కడే పడుకుందాం" విక్రమ్ అన్నాడు పరిసరాల్ని చూస్తూ.

కింద చెట్ల ఆకులు రాలి వున్నాయి.

"ఈ అడవిలో రాత్రంతా ఈ చెట్లకింద పడుకోవటం ప్రమాదం కదూ?" అన్నాడు రాజు.

"ప్రమాదమే. ఐనా తప్పదు. కిందపడుకోవటం కంటే ఈ చెట్టుమీద పడుకోవటం మంచిది. ఏమంటావ్?"

"నాకు చెట్టు ఎక్కటం రాదు. కిందనే పడుకుందాం. అవకాశం వున్నంతవరకు మెలకువగానే వుందాం."

ఆకులను పక్కకు నెట్టేశారు.

బ్లాంకెట్ పరిచారు.

బ్యాగ్‌లలో వెతికితే బ్రెడ్ కనపడలేదు.

"మనం గమనించలేదు. బాగా ఆకలిగా వున్నందున బ్రెడ్ అంతా ఉదయమే తినేశాం. ఇప్పుడెలా?" అన్నాడు రాజు.

"అవును. మనం రాత్రి విషయం మరచిపోయాం—"

అప్పుడు చూశాడు విక్రమ్-వాళ్ళు కూర్చున్న చెట్టుకు పైన వేల్లాడుతున్న ఎర్రటి కాయలు.

"ఈ కాయలు కోసుకుతిందాం."

"బావుంటాయా?" అడిగాడు రాజు.

"తెలీదు" అంటూ దగ్గర్లోనే కింద ఏదో పిట్ట కొరికి పడేసిన కాయను అందుకుని కొరికాడు.

తియ్యగా వుంది.

"బావుంది. ఎన్నైనా తినొచ్చు. నువ్వు చెట్టెక్కి

కాయలుకోసి పడెయ్యి."

నవ్వేడు రాజు—

"ఇప్పుడే చెప్పాను. నాకు చెట్టెక్కడం రాదు."

"అవును. మరచిపోయాను. ఐతే నేను ఎక్కుతాను."

"మరచిపోయాను. మనం పడుకుంటాంకదా. మన జేబులో ఈ వజ్రాలపెట్టె ఎందుకు? బ్యాగ్‌లో పెడదామా?" అన్నాడు రాజు.

"వద్దు. మనం నిద్రలో వున్నప్పుడు ఏ అల్లరి కోతులైనా వచ్చి మన బ్యాగ్‌లను తీసుకుపోవచ్చు. అందుకే ఆ పెట్టెను ఇలా ఇవ్వు. నేనో సురక్షితమైన ప్రదేశంలో దాచి వుంచుతాను."

"ఎక్కడ?" వజ్రాలు వున్న చిన్న బాక్స్‌ను ఇస్తూ అడిగాడు రాజు.

"ఇక్కడ" అన్నాడు విక్రమ్. ఆ బాక్స్‌ను ఆ చెట్టుకు వున్న తొర్రలోకి జారవిడిచి.

"గుడ్ ప్లేస్" అన్నాడు రాజు.

అప్పుడు విక్రమ్ నిల్చుని గబగబా చెట్టుపైకి ఎక్కాడు.

రాజు కింద నిల్చుని కాయలు ఎక్కడ ఎక్కువగా వున్నాయో చెబుతున్నాడు.

విక్రమ్ రెండు కాయలుకోసి కిందకు వదిలాడు.

'కెవ్వు'న అరిచాడు రాజు.

ఉలిక్కిపడి ఒంగి కిందకు చూశాడు విక్రమ్.

వణికిపోయాడు—

ఏదో పులి రాజుమీద దాడిచేసింది. మరోసారి అరిచాడు రాజు—కిందపడి దొర్లుతూ—

విక్రమ్ కాళ్ళు వణికాయి—

జేబులో తడుముకున్నాడు పిస్తోలుకోసం — లేదు. ఎక్కడో పడిపోయి ఉండాలి. అవును. ఎక్కడో కాదు—ఆమెను లాంగదీసుకోటానికి పెనుగులాడు తున్నప్పుడు పడిపోయి వుండాలి.

ఒక్కసారిగా గాండ్రించింది పులి.

మరింత బిగుసుకుపోయాడు.

కిందికి చూస్తూనే వున్నాడు విక్రమ్.

రాజు పులి బారినించి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాడు అయినా నే.

ఐనా అతని ప్రయత్నం ఫలించలేదు. అతని జేబులో పిస్తోలు వుంది. ఐనా దాన్ని బయటకు లాగే అవకాశం పులి ఇవ్వటంలేదు.

పులి అతనిమీద పంజా విసురుతోంది — గాయాలైనాయి బాగా—నెత్తురు కారుతోంది.

లాస్ట్ మినిట్ —ఆఖరి క్షణం—

బాధగా—మృత్యు ముఖంలోకి వెళుతూ అరిచాడు రాజు.

పులి అతడి గొంతును కొరికింది కసిగా—

చిన్న మూలుగు....తూలి కిందపడపోయాడు విక్రమ్-

భయంకర సంఘటన.

వూహించని ఇన్సిడెంట్ —

అతను చూస్తుండగానే పులి రాజు శరీరాన్ని చీకట్లో పొదలవైపుకు ఈడ్చుకు వెళ్ళింది.

ఏడుపొచ్చింది అతనికి—ఏడ్చాడు. అప్పుడు అతన్ని హఠాత్తుగా గొప్ప పిరికితనం ఆవహించింది.

ఇప్పుడు తను ఒంటరివాడు.

ఆ రాత్రి అతను చెట్టు దిగిరాలేదు. చెట్టుమీదనే

కొమ్మలమధ్య కూర్చుని వున్నాడు—

రాత్రి అంతా యేవో జంతువుల అరుపులు ఆతనికి వినిపించాయి. అనుక్షణం మృత్యువువాత పడుతూ ఆర్తనాదం చేస్తున్న రాజు రూపమే అతని కళ్ళముందు కదిలింది—

ఎలాగో తెల్లవారింది.

అప్పుడు కూడా అతను చెట్టు దిగి రావటానికి భయపడి బాగా ఎండవచ్చేవరకు అక్కడే కూర్చున్నాడు.

8

ఎండొచ్చింది.

పిట్టలు ఎగురుతున్నాయి.

పొదల్లోనించి బయటకు వచ్చి కుందేళ్ళు గడ్డి తింటున్నాయి.

అతనికి బాగా దాహంగా కూడా వుంది.

ఇక తప్పదనుకుని చెట్టుదిగి కిందకు వచ్చాడు.

కింద అతనికి నెత్తురుమరకలు కనిపించాయి.

అతనికి కన్నీళ్ళొచ్చాయి.

అక్కడినించి గబగబా ముందుకు వెళ్ళాడు. అలా కొంచెందూరం వెళ్ళేసరికి దూరంగా చిన్న నీటి మడుగు కనిపించింది. ఎప్పుడో కురిసిన వర్షానికి మిగిలిపోయిన్ల నీళ్ళు.

నడుస్తున్న అతను నీటిమడుక్కి కొంచెం దగ్గరకు రాగానే ఉలిక్కిపడ్డాడు.

నల్లగా వున్న పొడుగాటి పాము అతనివైపుకే వస్తోంది.

దాన్ని చూడగానే అతను నడక వేగాన్ని పెంచి ముందుకు పరుగుదీశాడు.

అంతే—

పెద్దగా అరిచాడు.

విక్రమ్ ఆ ఊబిలో దిగిపోయాడు సగం వరకు—

పాము అతనిముందునించే వెళ్ళిపోయింది మెలికలు తిరుగుతూ—ఆ నల్లపాము చాలా ప్రమాదకరమైనది—అది కాటువేస్తే కేవలం మూడునిమిషాల్లోనే ప్రాణం పోగొట్టుకుంటారు.

తనో వూబిలో దిగబడ్డాడని తెలియగానే ప్రాణ భయంతో "రక్షించండి...." అని పిచ్చి పట్టినట్టుగా అరిచాడు.

అది అడవి అనీ, అక్కడ యెవ్వరూ లేరనీ అతడికి తెలుసు—ఐనా అరిచాడు.

కాని వూహించని విధంగా చెట్లమధ్యనించి చేతిలో తుపాకీతో ఆక్కడికో మనిషి వచ్చాడు.

ఫారెస్టు ఆఫీసర్—

ఆయన్ని చూడగానే విక్రమ్‌కు ఆశ కలిగింది—కాని అయినకు తను—రాజు చేసిన ద్రోహం గుర్తుకు వచ్చింది.

ఐనా—"ప్లీజ్....రక్షించండి" అన్నాడు దీనంగా.

"రెండోవాడు యెక్కడ?" ఉరిమినట్టు అడిగాడాయన.

ఆయన తనని రక్షించడని అతనికి అర్థమయ్యింది. అప్పటికే అతను ఛాతీవరకు ఊబిలో దిగబడి పోయాడు.

ఫారెస్టు ఆఫీసర్ తుపాకి అతనికి గురిపెట్టాలనే అను కున్నాడు—ఆయనకు నౌకరు జరిగిన ఘోరాన్ని చెప్పాడు.

ఎదురుగా ఊబిలో దిగి మృత్యువు కౌగిలిలోకి వెళు తున్న విక్రమ్‌ను చూడగానే ఆయన తుపాకీ దించాడు.

తమ కథనంతా గబగబా ఆయనతో చెప్పి రాజును రాత్రి పులి చంపి తీసుకుపోయిందని కూడా చెప్పాడు. ఏడుపుతో —

ఐనా ఫారెస్టు ఆఫీసర్ జాలిపడలేదు.

"మీకు మేముచేసిన ద్రోహానికి క్షమించండి. ద్రోహిని చావు యెప్పుడూ వెంటాడే వుంటుంది. చావబోయే ముందు మీతో నిజం చెబుతాను. యెదురుగా వున్న ఈ దారిలో కొంచెం దూరంలో పెద్ద చెట్టువుంది. అక్కడ మా బ్యాగ్‌లుకూడా వున్నాయి. ఎనిమిది అపురూపమైన వజ్రాలున్న పెట్టె ఆ చెట్టు తొర్రలో వుంది. వాటి విలువ కోటిరూపాయాలని చెప్పానుకదా. వెళ్ళండి. వాటిని తీసుకోండి...."

విక్రమ్ చెప్పిన ఆ మాటలను ఫారెస్టు ఆఫీసర్‌తో పాటు మరో మనిషికూడా అక్కడికి దగ్గర్లోనే ఉన్న చెట్టు చాటున పొంచి వుండి విన్నాడు.

అతనే బాస్.

బాస్‌కు లక్ష కళ్ళు. అందుకే ఆ ఇద్దరినీ ట్రేస్ చేసి అక్కడకు రాగలిగాడు ఆ ఓముకు.

సంతోషం కలిగింది బాస్‌కు.

ఎలాగైతేనేం ఇంత దూరం శ్రమపడి వచ్చినందుకు ఆ వజ్రాలు తనకు దొరుకుతున్నాయి.

గబగబా చప్పుడవకుండా అక్కడినించి కదిలాడు.

విక్రమ్ పూర్తిగా ఊబిలో మునిగిపోయాడు.

ఫారెస్టు ఆఫీసర్ భారంగా నిట్టూర్చి వెనక్కు తిరిగాడు.

ఆయన ఆ చెట్టు దగ్గరకొచ్చేసరికి అప్పటికే చెట్టు తొర్రలో చెయ్యిపెడుతున్న బాస్‌ను చూసి ఆశ్చర్య

పోయాడు.

ఆశ్చర్యంనించి తేరుకోవటానికిముందే బాస్ 'కవ్వ'న అరుస్తూ చేతిని బయటకు లాక్కుని వెనక్కి పడి పోయాడు.

ఒక్క నిమిషంలో ఆ చెట్టు తొర్రలోనించి రెండు పొడుగాటి నల్లపాములు బయటకు వచ్చి చెట్టు వెనక్కు పాకుతూ వెళ్ళిపోయాయి.

బాస్ దగ్గరకు వెళ్ళాడు ఆయన.

"ఎవరున్నవ్వ?"

బాస్‌కు లక్ష కళ్ళు. కాని రెండు నల్లపాములు వేసిన నాలుగు కాట్లకు అతని లక్ష కళ్ళూ మూసుకుపోయాయి.

తనెవరో చెప్పకుండానే కళ్ళూ మూశాడు. అతని శరీరం నిమిషాల్లో నీలిరంగులోకి మారిపోయింది.

జాగ్రత్తగా లోపలకు చూసి తుపాకి బారల్‌తో రెండుసార్లు తొర్రలో పొడిచి తర్వాత అందులోనించి బాక్స్ తీసి మూత తెరిచాడు.

అపురూపమైన ఎనిమిది వజ్రాలు కనిపించాయి.

ఒక్క నిమిషం వాటిని చూశాడు—తర్వాత ఇలా అనుకున్నాడు మనసులో—

'ఈ వజ్రాల గురించే ఇద్దరు దుర్మార్గులు అడవిలోకి పారిపోయి వచ్చారు. ప్రాణప్రదంగా చూసుకునే తన భార్యను చంపారు. తర్వాత ఆ ఇద్దరూ ఘోరంగా చచ్చిపోయారు. మరో మనిషి కూడా ఈ వజ్రాల కోసమే పాము కాట్లకు బలైపోయాడు. ఇక ఈ వజ్రాలు....'

మళ్ళీ ఊబి దగ్గరకు నడిచాడు.

వజ్రాల గురించి ప్రాణాలు పోగొట్టుకున్న ఇద్దరిలో

ఒకడ్ని పులి యెక్కడకు ఈడ్చుకుపోయిందో తెలీదు. రెండో మనిషి తన కళ్ళముందే వూబిలో మునిగిపోయాడు.

చేతిలో వున్న వజ్రాల పెట్టెను ఊబిలోకి విసిరాడు ఆయన.

కోటి రూపాయల విలువైన వజ్రాలు ఊబిలో దిగిపోయాయి—నిమిషంలో.

భారంగా అక్కడినించి కదిలాడు ఫారెస్టు ఆఫీసర్.

—: అయిపోయింది :—